నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

శనివారం
15 జూన్
2024
పేజీలు 8

గుంటూరు
పల్నాడు



విద్యార్థుల చదవడం బండరాళ్ళు లాంటి పుస్తకాల బ్యాగులు విశేష ప్రభావాన్ని చూపుతున్నాయి. చిన్నారులు బ్యాగులు మోయలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హమాలీలు మోస్తున్న బరువైన బస్తాల కన్నా బ్యాగుల బరువు ఎక్కువైపోయింది. దీంతో స్కూల్ కి వెళ్తున్న చిన్నారులు తరచూ వ్యాధులకు గురవుతున్నారు. పుస్తకాల బ్యాగులు నిత్యం మోసి మోసి అలసిపోతున్నారు. ఇంటికి వచ్చాక బ్యాగులో ముతా నుంచి నీరసంతో కుదేలవుతున్నారు. ఇష్టమొచ్చిన రీతిలో పుస్తకాలు ఇస్తున్నారు. ఏ ఒక్క పాఠశాల నిబంధనలను పాటించటం లేదు. బ్యాగులు మూసి మెడ, భుజాలు, కాళ్లు నొప్పులు వస్తున్నాయని చిన్నారులు వాపోతున్నారు..

గుంటూరు.జిల్లా
నేటి దినపత్రిక
సూర్య బ్యూరో



# బాల్యంపై బ్యాగుల భారం

## ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం - పుస్తకాల బరువు తగ్గాలంటున్న వైద్యులు

బండరాళ్లుగా మారుతున్న బ్యాగులు చూస్తే పెద్దలకే భయం వేయడం ఖాయం... అంతంత బరువులు వారు ఎలా మోస్తారో... ఒక్కోసారి తలుచుకుంటేనే బాధవేస్తుంది. హమాలీ పని చేస్తున్నట్లు బరువైన స్కూల్ బ్యాగులతో బడులకు వెళ్లే విద్యార్థులను చూస్తుంటాం. అవసరం ఉన్నా లేకపోయినా వేలాది రూపాయలు వెచ్చించి కిలోల కొద్దీ బరువులను విద్యార్థుల వీపునకు తగిలిస్తున్నారు. పుస్తకాలు సంచుల మోతతో పాటు పాఠశాలల్లో సరైన సదుపాయాలు లేక పిల్లల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. పోటీ చదువుల పేరిట అటు తల్లిదండ్రులు, ఇటు పాఠశాలయాజమాన్యాలు పిల్లలపై పుస్తకాల భారం మోపుతున్నారు. తద్వారా చిన్నారులు విద్యార్థి దశ నుంచే నడుము నొప్పి కండరాల బలహీనత, మెడ, బుజాలు, భాగాల్లో నొప్పి కలుగుతోంది. అలసటతో బడి నుంచి సాయంత్రం ఇంటికి వచ్చే సరికేనీరసపడిపోతున్నారు. ఇలా పలు రుగ్మతుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులు ఇష్టమొచ్చినట్లు పుస్తకాలు అంటగడుతున్నారు. పుస్తకాల అధిక బరువు పిల్లల పాలిట శాపం గా మారనుంది. ఉదాహరణకు 1వ తరగతి విద్యార్థికి సుమారు 3 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అంటగడుతున్నాయంటే... పుస్తకాల మోత ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. భారీ పుస్తకాల సంచులను మోస్తూ 68 శాతం బాలలు వెన్ను నొప్పిని ఎదుర్కొంటున్నారని ఓ సర్వేలో తేలింది. 7 సంవత్సరాల నుంచి 13 ఏళ్లలోపు వయసు గల 5000 మంది విద్యార్థులపై

మిగతా 3వ పేజీలో



## ఐటీ, ఎలక్ట్రానిక్ కంపెనీలను ఆకర్షిస్తాం

### మంత్రి నారా లోకేశ్

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీ నెరవేర్చేందుకు కృషి చేస్తామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మంత్రులకు శాఖల కేటాయింపు తర్వాత తొలిసారి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉద్యోగాల కల్పనకు ఇతర రాష్ట్రాలతో తీవ్రంగా పోటీ పడతామన్నారు. ఐటీ, ఎలక్ట్రానిక్ కంపెనీలను ఆకర్షిస్తామని తెలిపారు. వలస వెళ్లిన యువతకు స్థానికంగానే ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామన్నారు. పరిశ్రమల్లో ఉద్యోగాలు

మిగతా 3వ పేజీలో



## దోమల నివారణకు చర్యలు తీసుకోండి

- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్
- సమన్వయ కమిటీ సమావేశం నిర్వహణ
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

జిల్లాలో దోమలు వలన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా దోమల నివారణకు వైద్యారోగ్య , మున్సిపల్ , పంచాయితీ శాఖలు పటిష్ట ప్రణాళిక ప్రకారం పకడ్బంధీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి కీటక జనిత వ్యాధుల నివారణపై వైద్యారోగ్య, మున్సిపల్, పంచాయితీ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో

మిగతా 3వ పేజీలో



## నాదెండ్లకు పౌరసరఫరాల శాఖ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తెనాలి ఎమ్మెల్యే జనసేన పి ఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం మంత్రివర్గంలో శాఖను కేటాయించారు. నాదెండ్లకు ఆహార, పౌర సరఫరాల మరియు వినియోగదారుల

మిగతా 3వ పేజీలో

తీర్పు 2024

# మళ్ళీ సంకీర్ణ శకం...

**ఈసారి 400 పైగా సీట్లతో తిరుగులేని మెజారిటీ సాధించాలనుకున్న బిజెపీ సాధారణ మెజారిటీ సైతం సాధించలేక, మిత్ర పక్షాల తోడ్పాటుతో మూడోసారి అధికారం కైవసం చేసుకుంది. నెహ్రూ తరువాత వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా అధికారం చేపట్టిన వ్యక్తిగా మోదీ రికార్డు సృష్టించారు. ప్రాంతీయ పార్టీలపై ఆధార పడవలసి రావటం వల్ల సమాఖ్య భావన పెరుగుతుంది. నిన్నటి వరకు ప్రాంతీయ పార్టీలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని భావించిన బిజెపీ తన ధోరణి మార్చుకొని ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది.**

543 స్థానాలకు జరిగిన 18వలోక్‌సభ ఎన్నికల్లో 240 సీట్లు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించి, వరుసగా మూడోసారి అధికారం చేపట్టినప్పటికీ బీజేపీకి ఆ సంతోషం కనిపించడం లేదు. మరోవైపు 99 సీట్లలో విజయం సాధించిన కాంగ్రెస్ ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు అధికారం అంచుల దాకా వచ్చామన్న ఆనందంతో ఉండగా, ఎన్డీఏ మిత్ర పక్షాలు కేంద్రంలో కీలక పాత్ర పోషించ బోతున్నాయి. ప్రస్తుత ఫలితాలు కేంద్రంలో పదేళ్ల తర్వాత సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు దోహదం చేశాయి.

మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించడం, వారిని నిర్దాక్షిణ్యంగా అణగదొక్కాలని చూడడం, పంజాబ్, హర్యానా, యూపీల లో బీజేపీకి ప్రతికూలంగా మారింది. అగ్నివీర్ పథకం యువతలో నిరాశ, నిస్పృహలతో బీజేపీపై ఆగ్రహం కలిగేందుకు కారణమైంది. చివరికి ప్రధాని మోదీ సైతం గతంలో కన్నా తక్కువ మెజారిటీ సాధించారు. 2019లో వారణాసిలో 4.79 లక్షల మెజారిటీ సాధించిన మోదీ ఇపుడు 1.52 లక్షల మెజారిటీ మాత్రమే సాధించారు. ప్రతిపక్ష ప్రభుత్వాలను కూల్చడం (మధ్యప్రదేశ్), శివసేనను చీల్చడం వంటి చర్యలతో బీజేపీకి మకిలి అంటింది. వికసిత భారత్‌పై పెద్దగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయలేదు. ప్రచారంలో మోదీ స్వయంగా విద్వేష వ్యాఖ్యలు చేసారు.

కర్ణుడి చావుకు అనేక కారణాలు అన్నట్టు బీజేపీ బలం తగ్గటానికి కూడా చాలా కారణాలు ఉన్నాయి.

**ప్రభుత్వ వ్యతిరేకత**

సాధారణంగా అధికారంలో ఎవరున్నా సరే.. ఆ పార్టీ ఎంత మంచి పాలన అందించినా సరే.. ఏదో లోపం ఉంటుంది. మరోవైపు ఓటర్లలోనూ ఆశలు, ఆకాంక్షలు నానాటికీ పెరుగుతూనే ఉంటాయి. ఓ సారి పాలన పూర్తయ్యే సరికే ప్రతి పార్టీ ఎంతో కొంత వ్యతిరేకతను మూటగట్టుకుంటుంది. అయితే భారతీయ జనతా పార్టీ 2014 కంటే 2019లో మరిన్ని ఎక్కువ సీట్లు సాధించి ఘన విజయం సాధించడంతో తమ పాలనపై సానుకూలత తప్ప వ్యతిరేకత లేదన్న భావన కలిగింది. నిజానికి 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఖాతా కూడా తెరవలేకపోగా.. కేవలం హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలతో పాటు గుజరాత్, మహారాష్ట్ర వంటి పశ్చిమ రాష్ట్రాల్లో స్వీప్ చేయడమే ఆ పార్టీకి నాడు అంత బలాన్ని ఇచ్చింది. ఈసారి ఎన్నికలకు ముందు ఉత్తరాదిలో ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రత అంచనా వేయలేకపోయారు.

**రిజర్వేషన్లని ఎత్తేస్తారని ప్రచారం**

'అబ్‌కీ బార్ 400 పార్' అంటూ ఆత్మవిశ్వాసంతో ఉన్న బీజేపీకి.. అదే అంశంతో విపక్షాలుచెక్ పెట్టాయి. ఒకవేళ బీజేపీ కూటమికి గనక 400 సీట్లు వస్తే.. భారత రాజ్యాంగాన్నే మారుస్తారంటూ ప్రచారం మొదలు పెట్టారు. మరోసారి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లనీ ఎత్తేస్తారని గట్టిగానే ప్రచారం చేశారు. ఇది బాగా ప్రభావితం అయింది. ప్రధాని మోదీ-అమిత్ షా దీనిపై వివరణ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే.. రాజ్యాంగాన్ని మార్చడం గానీ, రిజర్వేషన్లు ఎత్తేయడం గానీ ఉండబోదని చెప్పారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మరోవైపు, బీజేపీ ప్రచారాన్ని కూడా రాహుల్‌గాంధీ ధీటుగానే ఎదుర్కొన్నారు. ఫలితంగా 2019లో యూపీలో 62 స్థానాలు గెలుచు కున్న బీజేపీ.. ఈసారి కేవలం 33 స్థానాలకు పరిమితమైంది.

**అంతర్జాతీయ పరిణామాల ప్రభావం**

గత పదేళ్లుగా అనేక సంఘటనలతో ప్రపంచం అతలాకుతలమైంది. కోవిడ్-19 మహమ్మారి, ఉక్రెయిన్- రష్యా దేశాల మధ్య సుదీర్ఘకాలంగా సాగుతున్న యుద్ధం, తాజాగా పాలస్తీనా ఇజ్రాయిల్ మధ్య నెలకున్న యుద్ధం, ఆర్థిక మందగమనం వంటి అంతర్జాతీయ పరిణామాల ప్రభావం యావత్ ప్రపంచంపై ఉంది. అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో ఆర్థిక వ్యవస్థలు అతలాకుతలమైన సమయంలోనూ భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ముందుకు సాగింది. కానీ ఈ క్రమంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల పెరిగాయి. ప్రభుత్వం సబ్సిడీల భారాన్ని తగ్గించుకోవడంతో పెట్రోల్, గ్యాస్, చివరకు రైళ్లలో వృద్ధులకు ఇస్తున్న రాయితీలు, సబ్సిడీలు కూడా మాయమయ్యాయి. ఫలితంగా ప్రభుత్వ వ్యతిరేకత పెరిగింది.



**బెంగాల్‌లో సీఏఏ**

మొత్తం 42 లోక్‌సభ సీట్లున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో 2019లో 18 సీట్లు గెలుపొందిన బీజేపీ, ఈ సారి 20 దాటి గెలుచుకుంటామని భావించింది. కానీ చివరకు 12సీట్లకే పరిమితం కావాల్సి వచ్చింది. బెంగాల్ ఫలితాలను తీవ్రంగా ప్రభావితం అంశం పౌరసత్వ సవరణ చట్టం. అఫ్ఘనిస్తాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాల్లో మతపరమైన హింసకు గురై భారత్‌కు వలసవచ్చిన ముస్లిమేతర మతాలకు చెందినవారికి భారత పౌరసత్వం కల్పించి పూర్తి హక్కులు కల్పించడమే ఈ చట్టం ముఖ్యోద్దేశం. కానీ ఓటుబ్యాంకు రాజకీయాలతో లబ్ది పొందాలనుకున్న విపక్షపార్టీలు నానా రాద్ధాంతం చేశాయి. బెంగాల్‌లో బంగ్లాదేశ్ నుంచి వలస వచ్చినవారి సంఖ్య గణనీయంగా ఉంది. వారిలో ముస్లిమేతరులు సీఏఏ కోసం దరఖాస్తు చేసుకుని పూర్తి హక్కులు పొందవచ్చు. కానీ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమత బెనర్జీ ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. "ఈ చట్టం ద్వారా పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుంటే.. మీ అంతట మీరు బంగ్లాదేశీ శరణార్థిగా చెప్పుకున్నట్టు అవుతుంది. మీకు ఇప్పటికే అందుతున్న ప్రభుత్వ ప్రయోజనాలు అన్నీ ఆగిపోతాయి" అంటూ మమత చేసిన ప్రసంగాలు ప్రజల్లోకి చొచ్చుకెళ్లాయి. ఫలితంగా బీజేపీకి పడాల్సిన హిందూ ఓట్లకు కూడా గండి పడింది.

**విపక్ష కూటమి పార్టీల పోరాటం..**

బీజేపీ ఓటమి, మోదీని గద్దె దించడమే ఏకైక లక్ష్యంగా చేతులు కలిపిన విపక్ష కూటమి పార్టీలలో తొలుత ఐక్యత లేకపోయినా తమ రాష్ట్రాల్లో చాలా వరకు ప్రభావం చూపాయి. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ, కేరళలో కమ్యూనిస్టులు కూటమి పొత్తులతో సంబంధం లేకుండా విడిగా పోటీ చేసినా మంచి ఫలితాలు సాధించటంతో కూటమి బలం పెరిగింది.

**ప్రభావం చూపని అయోధ్య రామాలయ అంశం**

అయోధ్య రామాలయం, హిందువుల చిరకాల వాంఛ. దాన్ని నిజం చేసినందుకు హిందువులంతా ఏకమై తమకు ఓటేస్తారని భావించిన చోటే బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. అయోధ్య పట్టణం ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలోనే బీజేపీ ఓటమి పాలైంది. జనవరిలో మందిరం ప్రారంభించినప్పుడు దేశమంతటా ఏర్పడ్డ భావోద్వేగ వాతావరణం మే నెల నాటికి చాలా వరకు చల్లారింది. ఆలయ నిర్మాణం కారణంగా ముస్లిం ఓట్లు ప్రతిపక్షాలకు గంపగుత్తగా పడ్డాయి. కానీ హిందువుల ఓట్లు కులాలవారీగా చీలిపోయాయి. ఫలితంగా అయోధ్య రామాలయం నిర్మించిన ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రంలోనే బీజేపీకి కోలుకోలేనంత గట్టి దెబ్బ తగిలింది.

**దక్షిణాదిన వికసించని కమలం**

దక్షిణాదిన బీజేపీ గతం కంటే ఓట్ల శాతం మెరుగు పరుచుకున్నా సీట్ల సంఖ్య విషయంలో నిరాశే ఎదురైంది. ఏపీలో మిత్ర పక్షాలతో కలిసి 6 చోట్ల పోటీ చేసి 3 గెలుచుకుంది. తమిళనాడులో ఓట్లశాతం పెరిగినప్పటికీ అది సీట్లు గెలుపించేంతగా లేకపోయింది. కేరళలో ఖాతా తెరిచి ఒక స్థానాన్ని గెలుపొందగలిగింది. కర్ణాటకలో జేడీ(ఎస్)తో కలిసి పోటీ చేసి పరవాలేదనిపించింది. అయినప్పటికీ 2019తో పోల్చితే స్థానాలు తగ్గాయి. తెలంగాణలో మాత్రమే 35% ఓట్లు సాధించి, 8 స్థానాల్లో గెలుపొంది సరికొత్త రికార్డు సృష్టించింది.

**స్థానిక నేతలను విస్మరించటం...రెబల్స్ ప్రభావం..**

ప్రభుత్వ వ్యతిరేకతను తప్పించుకోవడం కోసం మూడో వంతుకు పైగా సిట్టింగ్ అభ్యర్థులను మార్చుతూ చేసిన ప్రయోగం బెడిసికొట్టింది. ఈ క్రమంలో పార్టీ నేతలకు కాకుండా గెలుపు గుర్రాలు అనుకుంటూ ఇతర పార్టీల నుంచి వచ్చి చేరినవారికి పార్టీ టికెట్లు ఇచ్చింది. పార్టీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న కార్యకర్తలకు ఈ చర్య ఆగ్రహం తెప్పించింది. మరోవైపు టికెట్ దక్కించుకోలేకపోయిన సిట్టింగ్ ఎంపీలు కొందరు స్వతంత్రంగా బరిలోకి దిగితే, మరికొందరు ఇతర పార్టీల్లో చేరి పోటీ చేశారు.

ఫలితంగా ఓట్లు చీలి అనేక చోట్ల పార్టీ ఓటమికి కారణమయ్యాయి.యూపీ, రాజస్థాన్ రాష్ట్రాల్లో రాజకీయాల్లో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్న క్షత్రియ సామాజిక వర్గాన్ని బీజేపీ పక్కనపెట్టిందన్న భావన కలిగి క్షత్రియులు బీజేపీపై ఆగ్రహంతో ఆ పార్టీ ఓటుబ్యాంకును చీల్చారు. ఇలా అనేక కారణాలు కలిసి బీజేపీ ఆధిపత్యానికి బ్రేకులు వేయగా పదేళ్ల తర్వాత తొలి సారిగా అసలు సిసలు సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు బాటలు వేశాయి.

**రాహుల్ భారత్ జోడో, న్యాయ్ యాత్రలు..**

రాహుల్ తమిళనాడు నుంచి కశ్మీర్ వరకు పాద యాత్ర చేశారు. జోడో యాత్ర కొనసాగుతున్నప్పుడే కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇది రాహుల్ సాధించిన తొలి విజయం. ఆ తరువాత పార్టీ ఉనికే లేదనుకున్న తెలంగాణలో ఏకంగా అధికారం చేపట్టింది. అలా ఒక్కొక్కటిగా రాహుల్ యాత్రతో పాటు కాంగ్రెస్ పార్టీ జైత్రయాత్ర కొనసాగింది. బిజెపీ రాహుల్‌ను తక్కువగా అంచనా వేయటం మరో లోపం.

**1 శాతం ఓట్లు .....63 సీట్లు**

2019లో 303 సీట్లు సాధించిన బీజెపి ఈసారి 240 సీట్లు మాత్రమే సాధించింది. అంటే గతంలో కన్నా 63 సీట్లు తగ్గాయి. అయితే ఓట్లపరంగా చూస్తే ఈ తేడా చాలా స్వల్పంగా ఉన్నది. 2019 ఎన్నికల్లో బీజేపీ 37.7 శాతం ఓట్లు పొందగా, ఈసారి 36.56 శాతం ఓట్లు సాధించింది. అంటే కేవలం 1.20 శాతం ఓట్లు మాత్రమే తగ్గాయి.

**మళ్లీ సంకీర్ణ ప్రభుత్వ శకం**

దేశంలో మళ్లీ సంకీర్ణ ప్రభుత్వ శకం మొదలైంది. పదేళ్ల కిందటి రాజకీయ పరిస్థితులు మళ్లీ పునరావృత మయ్యాయి. వాస్తవానికి 2014, 2019లో ఎన్డీఏ కూటమిగా అధికారంలోకి వచ్చినప్పటికీ ఒంటరిగానే అధికారం చేపట్టడానికి అవసరమైన సీట్లను బీజేపీ దక్కించుకుంది. పేరుకు ఎన్డీయేగా అధికారంలో ఉన్నా బీజేపీకి ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన అవసరం లేదు. ఐతే ఇపుడు బీజేపీ మ్యాజిక్ ఫిగర్‌కు 31 సీట్ల దూరంలో 241 వద్దనే నిలిచిపోయింది. దీంతో అధికారంలోకి రావడానికి, తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ప్రాంతీయ పార్టీలపై బీజేపీ ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సంకీర్ణ ప్రభుత్వాలు మనకి కొత్తేం కాదు. 1951లో మొదటి ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటి వరకు 73 ఏళ్లలో 32 ఏళ్ల పాటు దేశంలో పార్టీలు కూటమిగా ఏర్పడిన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. 1977లో ఎమర్జెన్సీ ముగిసిన తర్వాత భారతీయ జనసంఘ్ నేతృత్వంలో 11పార్టీలు కలిపి జనతా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఈ ప్రభుత్వం 1979 వరకు కొనసాగింది. ఆ తర్వాత కాంగ్రెస్ మద్దతుతో చరణ్ సింగ్ ప్రధాని అయ్యారు. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు కూడా 2004 నుంచి 2014 రెండుసార్లు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వమే దేశాన్ని పాలించింది. 2014లో 282 సీట్లతో, 2019లో 303 సీట్లతో మోదీ సారథ్యంలో ఇతర పార్టీల మద్దతుతో పనిలేకుండా బీజేపీ అధికారం చేపట్టింది.

**సమాఖ్య భావన పెరుగుతుంది....**

ప్రస్తుతం బీజేపీ ప్రాంతీయ పార్టీలపై ఆధార పడవలసి రావటం వల్ల సమాఖ్య భావన పెరుగుతుందని రాష్ట్రాల ప్రాతినిధ్యం పెరుగుతుందని బీజేపీ ఏకపక్ష నిర్ణయాలకు చెక్ పెట్టవచ్చని భావించవచ్చు. నిన్నటి వరకు ప్రాంతీయ పార్టీలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవాలని భావించిన బిజెపీ తన ధోరణి మార్చుకొని ఇచ్చిపుచ్చుకునే విధంగా వ్యవహరించాల్సి ఉంటుంది. తనను కూటమి నేతగా ఎన్నుకున్న వెంటనే మోదీ ఇకపై ప్రభుత్వ నిర్ణయాలు ఉమ్మడిగా కలిసి తీసుకుంటామని ప్రకటించారు.

**ఏ.పి.కి ఇది సువర్ణ అవకాశం.**

ముఖ్యంగా ఏ.పి.కి ఇది సువర్ణ అవకాశం. విభజన సమస్యల పరిష్కారం, పోలవరం ప్రాజెక్టు పూర్తి, అమరావతి నిర్మాణాలకు కేంద్రం వెన్నుదన్నుగా ఉండవచ్చు. ఏ.పి.కి దక్కిన ఈ సువర్ణ అవకాశాన్ని చంద్రబాబు సద్వినియోగం చేసుకొని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు వేస్తారని ఆశిద్దాం.



- డా॥ వి.సతీష్

# నారా లోకేష్‌ను వరించిన హెచ్ఆర్డి ఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్

**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** గుంటూరు జిల్లా. మంగళగిరి నియోజకవర్గనికి చెందిన యువ గళం పాదయాత్ర అధినేత తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కు హెచ్ ఆర్ డి ఐ టి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖల మంత్రిగా పదవి దక్కింది. ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణం చేసిన సమయంలోనే మంత్రులచే ప్రమాణస్వీకారం తదుపరి శాఖల కేటాయింపు. జరుగుతుందని భావించారు. మంత్రుల శాఖల కేటాయింపులో కొంత వ్యవధి ఉండడంతో ఎప్పుడెప్పుడా అని అందరూ అంతట ఉత్కంఠగా ఎదురుచూస్తున్న తరుణంలో అష్టమి శుక్రవారం రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు శాఖలను కేటాయించారు. మంగళగిరి నియోజకవర్గం నుండి వైసీపీ పార్టీకి చెందిన మురుగుడు లావణ్య పై 91 వేల 413 ఓట్లు మెజార్టీతో విజయం సాధించిన నారా లోకేష్ కు తొలి విడతలో ఐటి శాఖ మంత్రిగా పదవి వరించింది .జిల్లా నుండి జనసేన పార్టీకి చెందిన నాదెండ్ల మనోహర్ కు ఆహార పౌరసరఫరాల పదవి దక్కింది .హెచ్ఆర్డిఐటి ఎలక్ట్రానిక్స్ అండ్ ఆర్టిజి శాఖల మంత్రిగా రాష్ట్ర ప్రజలకు మరిన్ని సేవలు అందించే అవకాశం కలగడంతో జిల్లాలోని



మంగళగిరి నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు యువ. గళం పాదయాత్ర ద్వారా ప్రజల సమస్యలు ,నిరుద్యోగ యువత, గ్రామాల సమస్యలను తెలుసుకోవడం జరిగింది. ఆ తదుపరి రచ్చబండ కార్యక్రమాలు ద్వారా గ్రామాల్లోని సమస్యలను ప్రజల నుండి తెలుసుకున్నారు. మంగళగిరి నియోజకవర్గంలోని మంగళగిరిని ఐటి హబ్‌గా తీర్చి దిద్దుతానని పలు పరిశ్రమలను రప్పించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యత లోకేష్ తీసుకుంటాడని ఆనాడు హామీ ఇవ్వడం జరిగింది. ఈనాడు మంగళగిరిలో పలు పరిశ్రమలు స్థాపించేందుకుగాను నిరుద్యోగులకు మెండుగా ఉపాధిని కల్పించేందుకు గాను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ కు ఐటి శాఖను కేటాయించడంతో మంగళగిరి నీఐటి హబ్ గా తీర్చిదిద్దడంలో ఎటువంటి అతిశయోక్తి. లేదంటున్నారు .అదేవిధంగా విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తేవాలని, ప్రైవేటు విద్యాసంస్థలులో ఫీజులు చెల్లించలేకున్నారని, రాష్ట్ర ప్రజలకు ఉచితంగా ఏమి అందించకుండా ప్రతి ఒక్కరికి విద్యను ,వైద్యాన్ని అందించే దిశగా ప్రణాళికలు వేసి ఆ దిశగా నూతన ప్రభుత్వంలో చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఉందంటున్నారు .నూతన ప్రభుత్వంలో కీలకమైన బాధ్యతలు చేపట్టిన మంత్రులు తొలిగే రాష్ట్రంలో చిన్న భిన్నమైన ఆర్థిక వ్యవస్థ పైన అస్తవ్యస్తంగా. నున్న రోడ్ల పైన దృష్టి పెట్టి ప్రజలకు ప్రజాప్రయోగ సౌకర్యాలను నెలకొల్పి మరో రెండు, మూడు దశాబ్దాల పాటు ప్రజల మనసులలో చిరస్థాయిగా తెలుగుదేశం పార్టీఉండే విధంగా ప్రజల మన్న న లను పొందాలని మండలంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు ,కార్యకర్తలు మహిళలు, నిరుద్యోగులు ప్రజలు పదేపదే కోరుకుంటున్నారు.

# దళిత మహిళకు హోం మంత్రి కల్పించడం అభినందనీయం

- తెదేపా నాయకులు సుద్దపల్లి నాగరాజు
- అంబేద్కర్, చంద్రబాబుకు పాలాభిషేకం

**తెనాలి, మేజర్ న్యూస్ :** చంద్రబాబునాయుడు క్యాబినెట్ లో దళిత మహిళ అయిన వంగలపూడి అనితకు హెూమ్ మంత్రి పదవి కల్పించడం అభినందనీయమని తెదేపా నాయకులు, మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు పేర్కొన్నారు.ఇటీవల ఏర్పడిన రాష్ట్ర మంత్రి వర్గంలో దళిత మహిళకు హెూమ్ మంత్రి దక్కడంపై తెదేపా నాయకులు,మాస్ వ్యవస్థాపకులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక స్టేషన్ రోడ్డులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా సుద్దపల్లి నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులకు గురి చేసిన అనితకు హెూమ్ మంత్రి ఇవ్వడం చంద్రబాబుకు దళితులపై ఉన్న ప్రేమగా భావిస్తున్నామని తెదేపా రాష్ట్ర మహిళ అధ్యక్షురాలిగా తెదేపా అధికారంలోకి రావడానికి ఎంతో కృషి చేశారని ఇలాంటి పదవులు దళితులకు కల్పించడం చంద్రబాబునాయుడుకు కొత్తేమి కాదని గతంలో బాలయోగికి స్పీకర్ స్థానం కల్పించడని



ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా తెదేపా ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు అత్తోట శరత్ మాట్లాడుతూ దళిత మహిళకు హెూమ్ మంత్రి రావడంపై ఆలపాటి రాజేంద్రప్రసాద్ నాయకత్వంలో స్టేషన్ రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి,చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేయడం సంతోషంగా ఉందని వైసీపీని పాతాలానికి తొక్కుతాం అని నెరవేర్చిన పవన్ కళ్యాణ్ కి అభినందనలు తెలియజేస్తూమని తెలిపారు. మంత్రి వర్గంలో ఎస్సీ,ఎస్టీ,బీసీ మైనార్టీలకు ప్రముఖ స్థానం కల్పించారని దళితులకు అండగా ఉండే పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు.మాస్ రాష్ట నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ మాట్లాడుతూ మాదిగలకు న్యాయం జరిగిందంటే తెలుగుదేశం పార్టీలోనేనని మాదిగల అభివృద్ధి కూడా తెదేపాతోనే కూడి ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా ఎస్సీ రాష్ట్ర నాయకులు నలుకుర్తి రమేష్,యడ్లపల్లి అనిల్, రావూరి సతీష్,లింగాల రమేష్,ఎమ్మార్పీఎస్ నాయకులు కొండమూది బోస్ బాబు,ఉన్నం సన్నీ, ఉన్నం ఇమ్మానుయేలు, గుమ్మడి సంపత్, జెట్టి రోబో, పొన్నెకంటి లోకేష్, యడ్లపల్లి విక్కీలంక మహేష్, సుద్దపల్లి స్వామియేలు పాల్గొన్నారు.

# బాల్యంపై బ్యాగుల భారం

(మొదటి పేజీ తరువాయి)

అస్సోచామ్ అనే సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ నిజం వెలుగు చూసింది. ముందు వెన్ను నొప్పితో ప్రారంభమై ఆ తరువాత గూనిగా మారుతుందని ఆ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం స్పందించినా...ఉమ్మడి జిల్లాలోని 57 మండలాల్లో సుమారు 4540 పాఠశాలలు ఉండగా... ఇందులో 4 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. పిల్లల వయసుకు మించి పుస్తకాల బరువు మోయకుండా చర్యలు తీసుకోవడంలో భాగంగా మానవ మనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ 1993లో మస్‌పాల్ కమిటీని నియమించింది. ఆ కమిటీ పిల్లల సామర్థ్యానికి మించి బరువులు మోయకూడదనే నివేదిక ఇచ్చింది. దీనిపై 2006లో కేంద్రం చట్టం తీసుకొచ్చింది. పిల్లల బరువులో 10 శాతం బరువు ఉన్న పుస్తకాలకంటే ఎక్కువ మోయకూడదని ఆదేశించింది. కానీ పాఠశాలలు ఇవేవీ పట్టించుకోవడం లేదు. 10 శాతం బరువు కన్నా ఎక్కువ బరువును మోస్తే పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది. 2020 సంవత్సరంలో ప్రభుత్వం ఒక నూతన పథకానికి శ్రీకారం చుట్టినా అది అమలుకు నోచుకోలేదు. ప్రతి నెల 1వ, మూడవ శనివారం నో బ్యాగ్స్‌డే పద్ధతిని అమలు చేయాలని ఆదేశించినప్పటికీ ఇది ఎక్కడా అమలుకు నోచుకున్న దాఖలాలు లేవు. పుస్తకాల బరువు తగ్గించాలి పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో అవసరం ఉన్న మేరకే పుస్తకాలు వినియోగించాలి. ప్రతిరోజు విద్యార్థులు అన్ని పుస్తకాలు తీసుకెళ్లకుండా అవసరం మేరకే తీసుకెళ్లేలా పాఠశాలలో చర్యలు తీసుకోవాలి. పుస్తకాల బరువు మోయడం ద్వారా పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చే సిరికి నీరసించిపోతున్నారు. విద్యార్థులపై భారం తగ్గించేలా చర్యలు చేపట్టాలని నిపుణులు చెబుతున్నారు పాఠశాలల విలీనం ద్వారా దూరం పెరిగే అవకాశ ఉంది. ఇంత దూరం విద్యార్థులు పుస్తకాల బరువు మోయాలంటే ఇబ్బందికర పరిస్థితే. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేలా ఆయా పాఠశాలల్లో ర్యాక్స్ ఏర్పాటు చేసి టెక్ట్స్‌బుక్స్ అన్నీ పాఠశాలల్లోనే ఉంచుతూ, హెూమ్ వర్క్ బుక్స్ మాత్రమే ఇంటికి తీసుకెళ్లేలా చర్యలు చేపడితే విద్యార్థులపై కొంత భారాన్ని తగ్గించవచ్చు. పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని డాక్టర్లు మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న వయసు పిల్లలు ఎక్కువ బరువు మోస్తే వారి వారి శరీరాకృతి దెబ్బతినే అవకాశం ఉంది. బుజాలు, మెడ, నడుము భాగాల్లో నొప్పి కలుగుతుంది. నీరసంగా అనిపిస్తుంది. విసుగు, తలనొప్పి లాంటి సమస్యలు ఎదురవుతాయి. పిల్లలకు పుస్తకాలతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగించేలా విద్యాబోధన ఉండాలి. ఈ విషయంలో పాఠశాలల యాజమాన్యాలు, అధికారులు చొరవ చూపాలి.

# నాటి దుర్గాభాయి దేశ్‌ముఖ్ నేటి హోం మంత్రి అనిత



**తెనాలి, మేజర్ న్యూస్ :** పెదరావూరు ఫిల్మ్ స్టూడియో తెనాలిలో నిర్మించిన "అంబేద్కర్"లో దుర్గాభాయి దేశ్ ముఖ్ పాత్రలో నటించిన వంగలపూడి అనిత నేడు ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వంలో అత్యంత కిలకమైన హెూంమంత్రి గా నియమితులయ్యారు. సినీ దర్శకుడు దిలీప్ రాజా శు క్రవారం మీడియతో మాట్లాడుతు అప్పట్లో మహిళాబిల్లును నాటి పార్లమెంటులో ప్రవేశ పెట్టమని న్యాయశాఖమంత్రి అంబేద్కర్‌ను కోరిన సన్నివేశాన్ని తెనాలిలోనే చిత్రీకరించానని చెప్పారు. అంబేద్కర్ పాత్రలో తెలుగుదేశం నేత వర్ల రామయ్య నటించగా దుర్గాభాయి దేశ్‌ముఖ్ పాత్రను అనిత పోషించారని ఆయన తెలిపారు. ప్రస్తుత కృష్ణాజిల్లా నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య కుడా భగత్ సింగ్ సమకాలీకులు ప్రీతిలత వాడేకర్ పాత్రలో నటించారని దిలీప్ రాజా పేర్కొన్నారు.అంబేద్కర్ లాంటి చరిత్రకారుని జీవితాన్ని చిత్రీకరిస్తుంటే భాద్యతగల ప్రజాప్రతినిధులుగా ఉండి కూడా తమ అమూల్యమైన సమయాన్ని అంబేద్కర్ షూటింగుకు కేటాయించి నటించడం వెనుక సామాజిక భాద్యత ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు..

## ఐటీ, ఎలక్ట్రానిక్ కంపెనీలను ఆకర్షిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సాధించేందుకు నైపుణ్య శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. గ్రామీణ విద్యావ్యవస్థను బలోపేతం చేసే అవకాశం రావడం పవిత్రమైన బాధ్యత అన్నారు. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవంతో మరింత మెరుగ్గా పనిచేస్తానని లోకేశ్ తెలిపారు.

## నాదెండ్లకు పౌరసరఫరాల శాఖ కేటాయింపు

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల శాఖను కేటాయించారు. గతంలో నాదెండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గా పనిచేసిన అనుభవం ఉంది. నాడు తెనాలి నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసి ఆయన గుర్తింపు పొందారు. పౌర సరఫరాల మంత్రిగా నియమితులైన నాదెళ్ల ఆ శాఖలో ఉన్న అవినీతిని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. నాదెండ్లకు చంద్రబాబునాయుడు క్యాబినెట్లో కీలకమైన పదవి దక్కడంతో జనసేన, తెదేపా, బిజెపి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## దోమల నివారణకు చర్యలు తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

మురుగు నీటి నిల్వలు ఏర్పడి పరిసరాలు అపరిశుభ్రతతో దోమలకు అవాసాలుగా మారతాయన్నారు. దీని వలన మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమల వ్యాప్తికి కారణమయ్యే మురుగునీటి నిల్వలు లేకుండా కాల్వలు సక్రమంగా ప్రవహించేలా మున్సిపల్, పంచాయితీ అధికారులు కాల్వల పూడికతీత పనులు ప్రణాళిక ప్రకారం చేపట్టాలన్నారు. దోమల నివారణకు అవసరమైన గంబూషియా చేపలు, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ అవసరం మేరకు సిద్ధం చేసుకోవాలన్నారు. ఖాళీ ప్రదేశాల్లోను, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమల లార్వ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. స్కూలు పిల్లలలో కూడా మలేరియా డెంగ్యూ కేసులు నమోదవుతున్న కారణంగా జిల్లా విద్యాశాఖ అధికారి దోమల నివారణ చర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలను, పాంప్లెట్ ను జతపరిచి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పంపాలని, పంచాయితీలు మున్సిపాలిటీలు మరియు కార్పొరేషన్ అధికారులు దోమల నివారణ చర్యలపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో వారం రోజులలో తెలియజేయాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతో పాటు, వ్యాధి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. మున్సిపల్, పంచాయితీ అధికారులు ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ళలోను, ఇంటి పరిసర ప్రాంతాల్లోను దోమలు నివారణకు చేపట్టాల్సిన శుభ్రత కార్యక్రమాలపై అంగన్ వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యుల ద్వారా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి, డా. కే.విజయలక్ష్మి, జిల్లా మలేరియా అధికారి సుబ్బారామాయణం, మత్స్యశాఖ అసిస్టెంట్ డైరక్టర్ గాలి దేముడు, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ సురేష్, డ్వామా పీడీ సరస్వతి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ కార్యాలయం సూపరింటెండెంట్ షాలిని, జిల్లా మలేరియా అధికారితో పాటు , ప్రోగ్రాం ఆఫీసర్స్ మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా చేగువేరా జయంతి ఉత్సవాలు



పొన్నూరు మేజర్ న్యూస్ : అన్యాయాలకు, దోపిడీలకు ఎల్లలు లేవు కావున వాటి అంతం కొరకు పోరాడే విప్లవ కారులకు కూడా ఏళ్ళలువుండకూడదని చాటిచెప్పిన విప్లవ కారుడు చేగువేరా అని ఆంధ్ర ప్రదేశ్ ప్రజా నాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి అరే టి రామారావు అన్నారు. స్థానిక సి పిఐ కార్యాలయం వద్ద జరిగిన చేగువేరా జయంతి సభలో ఆయన ప్రసంగించారు. సభకు ప్రజా నాట్యమండలి పొన్నూరు ఏరియా అధ్యక్షులు జంపని గోవిందరాజు అధ్యక్షత వహించారు. ఆరే టి మాట్లాడుతు చేగువేరా 1928సం జూన్ 14న అర్జెంటీనా దేశములోని రోసారియ పట్టణములోజన్మించారని ,బ్యూనాస్ ఎయిర్స్ యూనివర్సిటీలో డాక్టర్ కోర్స్ చదువుతూ విప్లవోద్యమం వైపు తన జీవిత ముసు అంకితమిచ్చారని అన్నారు. లాటిన్ అమెరికా దేశాల్లో గెరిల్లా సైన్యానికి తయారుచేసి అమెరికన్ సామ్రాజ్య విస్తరణ కు వారి దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని అన్నారు. క్యూబా విముక్తి కోసం ఫిడెల్ కాస్ట్రో తో కలసి అనేక నెలలుగా పోరాటం చేసి క్యూబా దేశాన్ని విముక్తిచేశారు. అనంతరం ఆదేశ మంత్రి వర్గంలో కొంత కాలం పాటు పనిచేసి లాటిన్ అమెరికా దేశాల్లో గెరిల్లా పోరాట యోధులు ను తయారుచేసి అమెరికన్ సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటంలో అసువులు బాసారని అన్నారు. చేగురా జన్మించి ఇప్పటికి 91సం.లు అయినప్పటికీ ప్రపంచము లో అనేక దేశాల్లో యువత మనసుల్లో నిలిచిపోయాడు అని అన్నారు.ఈకార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు,చైతన్య, దేవరకొండ శ్రీనివాస్,ఏసుబాబు, సుధీర్, ఆటో యూనియన్ నాయకులు మీనుగుల సత్యన్నారాయణ, రత్న బాబు,రాజేష్,బాబురావు,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి రక్తపు బొట్టు.. ప్రాణాన్ని కాపాడే ఆయువు బొట్టు.!!

నగరపాలక సంస్థ కమిషనర్ నిర్మల్ కుమార్



మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్ : ప్రతి రక్తపు బొట్టు ప్రాణాల్ని కాపాడే ఆయువు బొట్టు అని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమీషనర్ నిర్మలా కుమార్ అన్నారు. పంచ రక్త దాన దినోత్సవం పురస్కరించుకొని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కమీషనర్ నిర్మల్ కుమార్.వి అధ్యక్షతన సుమారు 52 సార్లు రక్తదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న మంగళగిరి ఎల్బీనగర్ కు చెందిన కొలుసు మోహనరావు ( రిటైర్డ్ ఏఎస్ఐ) సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది.ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ అన్ని దానాలలో రక్తదానం గొప్పదని ప్రాణాపాయ స్థితిలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి రక్తదానం ఎంతో ఉపయోగకరమని అలానే ప్రతి ప్రతి ఒక్క పౌరుడికి రక్తదానంపై. అపోహలకతీతంగా సరైన అవగాహన ఉండాలని తెలియచేశారు అనంతరం కొలుసు మోహన్ రావు ను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ఉపయోగపడే విధంగా తోడ్పడాలని ఆయన కోరారు.మోహన్ రావు పలువురికి ఆదర్శమని కొనియాడారు.తదనంతరం ఇందిరా నగర్ యూపిహెచ్సి డాక్టర్ అనూష మాట్లాడుతూ రక్తం అందక దేశంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని సమాజంలో చాలామంది అవగాహన లేక రక్తదానం చేయుటకు ముందుకు రావట్లేదని తెలిపారు.అదేవిధంగా రక్తదానం చేసే ముందు చేసిన తరవాత తీసుకొను జాగ్రత్తలు మరియు ఎటువంటి వారు రక్తదానం చేయవచ్చు ఎటువంటి వారు చేయకూడదు అనే విషయాలపై ఆమె అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక అతిథి కొలుసు మోహన్ రావు ఆయన విలువైన సందేశం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఈ , డిప్యూటీ కమిషనర్, డి,ఈ.ఈ, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో పేద ప్రజలకి మళ్లీ సువర్ణ యుగం

## గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్...

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

శుక్రవారం గుంటూరు పొన్నూరు రోడ్డు లోని గుంటూరు తూర్పు తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో గుంటూరు తూర్పు శాసనసభ్యులు మొహమ్మద్ నసీర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా 5 హామీల పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయటం చాలా ఆనందకరంగా ఉందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన తరువాత ఇచ్చిన హామీలను విస్మరించిన నాయకులను చాలా మందిని చూశాం..కాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో యువతకు, ప్రజలకు మనోధైర్యాన్ని కలిగించే విధంగా చంద్రబాబు పలు కార్యక్రమాలన్ని చేపట్టారన్నారు. ప్రజలు ఆలోచనలకు తగినట్టు కాకుండా తనకు ఇష్టమొచ్చినట్టు జగన్మోహన్ రెడ్డి అనాలోచిత విధానాలతో కక్ష సాధింపు ధోరణితో పరిపాలన చేశారని ,రాష్ట్ర ప్రజలను జగన్మోహన్ రెడ్డి భయభ్రాంతులకు గురిచేశారన్నారు. గతంలో



జగన్మోహన్ రెడ్డి కరెంట్ బిల్లులు అధికారంలో వచ్చాయన్న కుంటి సాకు చూపించి పెన్షన్లను అనేకమైన పథకాలు అర్హులైన పేద ప్రజలకు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని నసీర్ విమర్శించారు. ఐదు సంవత్సరాల పాటు రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. చంద్రబాబు వాగ్దానం చేసిన ప్రకారం తొలి సంతకం 16,437 మందికి మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించే కార్యక్రమం చేపట్టారు. రెండవ సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసేరన్నారు. మూడో సంతకం గత దోపిడీ ప్రభుత్వం 2000 నుంచి 3000 వరకు పెన్షన్ ని ఐదు సంవత్సరాలలో పెంచితే. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్న మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్కసారిగా వెయ్యి రూపాయలు పెంచి 4000 చేసిందన్నారు. అంతేకాకుండా హామీ ఇచ్చిన నెల నుంచి ఏప్రిల్ మే జూన్ నెలలకి రూ.1000 చొప్పున రేపు నెలలో మొత్తం 7000 రూపాయలు అవ్వ తాతల కి అందజేస్తారన్నారు. వృద్ధులకు, వికలాంగులకు మరియు కిడ్నీ వ్యాధిగ్రస్తుల లకు కలిపి 65 లక్షల మందికి సామాజిక భద్రత పెన్షన్ ల కింద 33వేల కోట్లు బడ్జెట్టు మేము కేటాయించుమన్నారు. నాలుగవ సంతకం రాష్ట్రంలో పేదవాడు తిండి కి ఇబ్బంది పడకుండా, రాష్ట్ర వ్యాప్తంగా 198 అన్నా క్యాంటీన్ కేంద్రాలను మళ్ళీ మేము పునప్రారంభించారన్నారు. ఐదవ సంతకం యువతకు ఉద్యోగ కల్పనలో అవసరమైనటువంటి స్కిల్ డెవలప్మెంట్ భారత దేశంలో ఎన్నడూ లేనటువంటి విధంగా శ్రీకారం చుట్టరన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా ఒక పండుగ వాతావరణం కనిపిస్తుంది అన్నారు.రాబోవు కాలంలో మా నాయకుడు చంద్రబాబు గారి నేతృత్వంలో పవన్ కళ్యాణ్ ఆలోచన విధానాలతో రాష్ట్ర ప్రజలకు యువ తకు మంచి పరిపాలన అందించే దిశగా అడుగులు వేస్తామన్నారు. తదుపరి తూర్పు నియోజకవర్గం లో ఉన్నటువంటి మహిళ్ళలు,అంగన్వాడి వారు పెన్షన్ దారులు, యువకులు ఇంకా అనేకమంది ఈ కార్యక్రమంలో పాల్గొని నసీర్ గారిని శాలువాలతో పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. నసీర్ గారు అందరికీ మిఠాయిలు తినిపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు యల్లావుల అశోక్,షౌకత్, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, జాగర్లమూడి శ్రీనివాసరావు, , వాణి, ప్రభాకర్, మహంకాళి నరసింహారావు,శ్రీను నాయక్, ఐలా శ్రీనివాసరావు, సత్యం, కొండలు ,కిరణ్ మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన సీఐ, ఎస్సైలను అభినందించిన ఎస్పీ

గుంటూరు క్రైం, మేజర్ న్యూస్: ఎస్సై స్థాయి నుంచి సిఐలుగా , ఏ ఎస్ ఐ నుండి ఎస్సైలుగా పదోన్నతి పొందిన వారిని శుక్రవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ లో పని చేస్తున్న ఎస్.ఐ నాగకుమారి సీఐగా పదోన్నతి పొందారు. అలాగే అరండల్ పేట పోలీస్ స్టేషన్లో ఎ.యస్.ఐ గా పని చేస్తున్న నరేంద్ర కుమార్, మరియు బాపట్ల జిల్లా నుండి గుంటూరు జిల్లాకు బదిలీ పై వచ్చిన ఎయస్ఐ మైలా బ్రహ్మయ్య లు ఎస్సైలుగా పదోన్నతి పొందిన సందర్భంగా గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ... విధులలో సమర్థవంతంగా పని చేసి ప్రజల్లో పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సమర్థవంతంగా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచిస్తూ... పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. నాగ కుమారి పాత గుంటూరు పోలీసు స్టేషన్ లో యస్ ఐ గా పని చేస్తూ సి ఐ గా పదోన్నతి పొందారు. గతంలో నల్లపాడు పోలీసు స్టేషన్, మహిళా పోలీసు స్టేషన్ లలో పని చేశారు.

# ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై న్యాయవాదుల హర్షం

- టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో స్వీట్స్ పంపిణీ
- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు
- టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు కూరపాటి మురళీ రాజు

మంగళగిరి టౌన్ మేజర్ న్యూస్ : దుర్మార్గమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పట్ల మంగళగిరిలో న్యాయవాదులు హర్ష%శ% వ్యక్తం చేశారు. శుక్రవారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలో కోర్టు సముదాయాలు ఎదుట బాణసంచా కాల్చి స్వీట్స్ పంచి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు కూరపాటి మురళీ రాజు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు టిడిపి జాతీయ అధ్యక్షులు ఏపీ నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైసీపీ సర్కార్ తెచ్చిన దుర్మార్గమైన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వాస్తవానికి వైసీపీ సర్కార్ ప్రజల ఆస్తులను బ్యాంకులలో తాకట్టుపెట్టి రుణములు తెచ్చుకునేందుకు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే నల్ల చట్టాన్ని తెచ్చారని విమర్శించారు. ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది వినటానికి సొంపుగా, అందంగా ఉంటుందని.. కానీ గులాబీ పూల వెనక ముళ్ళు ఎలా ఉంటాయో ఈ




చట్టం వెనుక రాకాసి పాదలు ఉన్నాయని ఆయన విమర్శించారు. పేదలు, ప్రజలు, రైతులు తమ రక్తాన్ని చెమట చుక్కలు గా మార్చి పైసా పైసా కూడా పెట్టుకుని కొన్న ఆస్తులపై తమ ఫోటోలు కాకుండా, జగన్ ఫోటోలు పెట్టుకోవడం పట్ల కుట్ర దాగి ఉందని ఆయన ధ్వజమెత్తారు. ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు 100 రోజులు పాటు కోర్టు విధులను బహిష్కరించి వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ విషయమై న్యాయవాదులు హైకోర్టులో కూడా పిటిషన్ దాఖలు చేశారని ప్రస్తుతము అది పెండింగ్లో ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఈ నల్ల చట్టం ప్రజలకు ఉపద్రవంగా మారుతున్నదని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు .ఎన్నికల హామీల అమలులో భాగంగా గురువారం చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత రెండవ ఫైల్ పై ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తూ సంతకం పెట్టడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ మేరకు జూనియర్ న్యాయవాదులకు నెలకు పదివేల రూపాయలు స్టయిఫండ్, న్యాయవాదులకు ఇల్లు కట్టించి ఇస్తామన్న హామీ అమలుపరస్తారన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది కొమ్మారెడ్డి వీరారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే నల్ల చట్టాన్ని రద్దు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్పందించిన నారా లోకేష్ కు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ న్యాయవాదులు వి .రత్న ప్రసాద్, నూతలపాటి నంబూద్రిపాడ్,. రెంటపల్లి రాజేష్, కట్టపోగు కోటేశ్వరరావు, రేఖ శ్రీ, రజిని, హైకోర్టు న్యాయవాది ఉమర్, తోట నరసింహారావు, కంచర్ల ప్రకాశరావు ఇంకా పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# స్టేడియాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అరవింద్ బాబు,మునిసిపల్ కమిషనర్

నరసరావుపేట, మేజర్‌న్యూస్

నరసరావుపేట పట్టణంలోని కోడెల శివప్రసాదరావు క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాది అని నరసరావుపేట ఎమ్మెల్యే అరవింద బాబు అన్నారు.ఈ మేరకు క్రీడా ప్రాంగణంలోనీ వాకింగ్ ట్రాక్,స్విమ్మింగ్ పూల్,జిమ్,షటిల్ కోర్టులను పరిశీలించారు.మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాలనలో గత ఐదు సంవత్సరాలు క్రీడా ప్రాంగణం మూతబడిందన్నారు.క్రీడా వ్యవస్థను నాశనం చేశాడని మండిపడ్డారు.స్టేడియాన్ని దగ్గరుండి బాగు చేసుకోవటం మన కర్తవ్యమని అన్నారు.కోడెల శివప్రసాదరావుకి ఎంతో ఇష్టపడి స్టేడియాన్ని దగ్గరుండి కట్టించాడన్నారు.వాకింగ్ ట్రాక్,జిమ్ము,క్రికెట్ స్టేడియం,వాలీబాల్ కోర్టు,స్విమ్మింగ్ పూల్ ట్రాకులన్నీ ఐదు సంవత్సరాల నుంచి పాడుబడిపోయాయని అన్నారు.కోడెల శివప్రసాదరావు స్టేడియాన్ని అభివృద్ధి ఎలా అయితే చేశాడో అదే విధంగా నేను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.స్టేడియానికి వచ్చే ప్రజలు ఎవరు ఇబ్బంది పడకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.అభివృద్ధిని గాలికి వదిలేసి వ్యవస్థలను వైసీపీ రాక్షస ప్రభుత్వం నాశనం చేసిందని అన్నారు.జగన్ పాలనలో డెవలప్మెంట్ లేక అన్ని వ్యవస్థలన్నీ మూతబడిపోయాయన్నారు.జగన్ రెడ్డి పాలనలో ధ్వంసం అయినా ప్రతి అభివృద్ధి పనిని పునః ప్రారంభించి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తానని ఎమ్మెల్యే  అరవింద బాబు అన్నారు.ఈ కార్యక్రమంలో కపిలవాయ విజయ్ కుమార్,గూడూరు శేఖర్, అడ్వకేట్ దేశి రెడ్డి చిన్నప రెడ్డి,కొవ్వూరు బాబు,మాబు,గంగూల పెద్దిరెడ్డి,హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట ప్రకారం మెగా డీఎస్సీ పై తొలి సంతకం



వినుకొండ, మేజర్‌న్యూస్

అతలాకుతలమైన మన రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణాస్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే డీఎస్సీ పై మొదటి సంతకం చేసిన సందర్భంగా పట్టణంలోని విద్యార్థి నాయకులు సంబరాలు జరుపుకున్నారు.వినుకొండ తెలుగు యువత,తెలుగు విద్యార్థి,ఐటీడీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద చంద్రబాబు,పవన్ కళ్యాణ్  చిత్రపటానికి పాలాభిషేకం చేసి అక్కడ ఉన్నటువంటి ప్రజానీకానికి స్వీట్స్ పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నర్రా కిషోర్,తెలుగు యువత అధ్యక్షుడు బోడపూడి శంకర్, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి జానీ,టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు తూమాటి కాశి, జిల్లా టీఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి వీరగంధం ప్రశాంత్, విద్యార్థులుతదితరులు పాల్గొన్నారు.

## చేతబడి కలకలం

మాచర్ల, మేజర్‌న్యూస్



పట్టణంలోని 5వ వార్డ్ 3వలైన్ పాత గొర్రెల మండి ప్రాంతంలో శుక్రవారం చేతబడి కలకలం రేపింది. ఆ ప్రాంతంలో ఉన్న మాజీ కౌన్సిలర్ బచ్చు సుబ్బారావుకు చెందిన అద్దె ఇళ్ళముందు గుర్తు తెలియని వ్యక్తులు కుంకుమతో త్రికోణం ఆకారం వేసి అందులో నల్ల దారం చుట్టిన ఒక కొబ్బరికాయ, గుడ్డతో చుట్టిన బొమ్మ,మేకులు గుచ్చిన నిమ్మకాయలు, పసుపు ఉంచారు. ఈ దృశ్యాన్ని ఉద యాన్నే ఆ ప్రాంత వాసులు చూసి భయాందోళనకు గుర య్యారు. మూడు రోజుల క్రితం ఆ ఇళ్ళల్లో అద్దెకు ఉండే ఓ వ్యక్తి ఉరివేసుకొని చనిపోయాడు.ఆ మరుసటి రోజునే ఇలా జరగటం పలు అనుమానాలకు తావిస్తుంది. నిజంగా చేతబడి చేశారా లేక ఇంటి యజమానిని బెదిరించేందుకు ఎవరైనా ఆకతాయిలు అలా చేశారా అనే విషయం అర్థం కావడం లేదు.ఈఘటనతో ఆ ప్రాంత వాసులు చీకటి పడకుండానే త్వరగా ఇళ్ళకు చేరుకొని బిక్కుబిక్కుమంటూ  గడుపుతున్నారు.

# సాగర్ చెక్ పోస్ట్ లో 32 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు

మాచర్ల, మేజర్‌న్యూస్



మాచర్ల మండలంలోని నాగార్జున సాగర్ బోర్డర్ చెక్ పోస్ట్ లో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న 32 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.ఈ విషయాన్ని రూరల్ సీఐ కే సురేష్ . విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ మల్లికా గార్గ్ ఆదేశాల మేరకు ముందుగా అందిన సమాచారంతో నాగార్జునసాగర్ పరిధిలోని బోర్డర్ చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా హైదరాబాద్ వైపు నుండి మాచర్ల వైపునకు వస్తున్న కేఏ 03 ఎండి 2710 నంబర్ గల ఫోర్డ్ కంపెనీ కారులో తనిఖీ చేయగా 19 ప్యాకెట్లలో సుమారు 32 కిలోల గంజాయి కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. అంతట సదరు కారులో ఉన్న మడకం రాంబాబు, బొరగా రాజేశ్వరి, చలంగి చంద్రశేఖర్ లను అదుపులోకి తీసుకొన్నట్లు సీఐ కే సురేష్ పేర్కొన్నారు.వీరు ముగ్గురు అల్లూరి సీతారామరాజు జిల్లా రాజమండ్రి, రంపచోడవరం ప్రాంతాలకు చెందిన వారని, ముగ్గురూ కలిసి అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.వారిని విచారించగా వీరి కారుకి ముందు ఫార్వార్డ్ గా ఇద్దరు,వెనుక . ఫార్వార్డుగా ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించమన్నారు. వారిని కూడా త్వరలోనే అరెస్టు చేయడం జరుగుతుందన్నారు.సరఫరా చేస్తున్న గంజాయిని కర్ణాటక బోర్డర్ లోని రాజారెడ్డి, సురేందర్ రెడ్డి అనే వ్యక్తులకు అందజేయడం జరుగుతుందని విచారణలో తేలిందన్నారు. వారిని కూడా పట్టుకొని విచారిస్తామన్నారు.తనిఖీలలో విజయపురి సౌత్ ఏఎస్సై సోమ్లా నాయక్,రూరల్ ఏఎస్సై తాలూకారావ్, కానిస్టేబుల్ సాంబ నాయక్ లు ఉన్నారు.వారిని సిఐ సురేష్ అభినందించారు.

# రొటేరియన్ బాలకృష్ణకు మాతృవియోగం

పొన్నూరు, మేజర్‌న్యూస్



స్థానిక నిడుబ్రోలు 14వ వార్డుకు చెందిన టిడిపి నాయకుడు రొటేరియన్ నన్నపనేని బాలకృష్ణ మాతృమూర్తి అరుణ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆమె ఇంటికి వెళ్లి మృతదేహానికి ఘనంగా నివాళులర్పిం చారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీవీ చౌదరి పటాన్ అహ్మద్ ఖాన్ బండారుపల్లి శ్రీనివాసరావు రెటీనా వీరయ్య వివేకా విద్యాసంస్థల డైరెక్టర్ ఉప్పాల సుకుమార్ , తాతారావు ఫిరోజ్ ఖాన్ రోటరీ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేట ప్రజల సమస్యల కు వెన్నంటే ఉంటా: ఎమ్మెల్యే అరవింద్ బాబు





నరసరావుపేట మేజర్ న్యూస్

నియోజకవర్గ అభివృద్ధికి తోడుండాలని కలెక్టర్ లత్కర్ బాలాజీని కోరిన ఎమ్మెల్యే  అరవింద బాబు నియోజకవర్గ ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని నరసరావుపేట ఎమ్మెల్యే డా??చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు.ఈ రోజు నుండి నియోజకవర్గంలో పేరుకున్న సమస్యల పై సమరం చేయబోతున్నానని తెలిపారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీ లాత్కర్ శ్రీకేశ్ బాలాజీ రావును కలిసి దుశ్వాలువాతో సత్కరించి,పుష్పగుచ్చం అందించారు.నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి తోడుగా నిలవాలని విన్నవించారు.గత ఐదేళ్లు ఒక లెక్క... ఇక నుండి మరో లెక్క అన్నారు.గతంలో ప్రజా ప్రతినిధులుగా ఉన్న వారు సమస్యలన్నీ గాలికి వదిలేశారన్నారు.కానీ,ఇక నుండి ఏ చిన్న సమస్య ఉన్నా నేరుగా ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయొచ్చని,వాటిని పరిష్కరించేందుకు తానే రంగంలోకి దిగుతానని ఎమ్మెల్యే డా??చదలవాడ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కపిలవాయ విజయకుమార్,పులుకూరి జగ్గయ్య,ఇమిడిశెట్టి కాశయ్య,గాడిపర్తి సురేష్, న్యాయవాది దేశి రెడ్డి చిన్నప రెడ్డి,భుజంగరావు,గూడూరు శేఖర్,బాలు, గంగుల పెద్ది రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తొలిరోజే ఐదు సంతకాలు చరిత్రాత్మకం



**◀ చంద్రన్న పాలనలో రానున్న ఐదేళ్ళ స్వర్ణయుగమే..!**

**◀ ఐదు సంతకాలతో రాష్ట్ర ప్రజలకు,యువతకు భద్రత, భరోసా టీడీపీ నేతలు**

మంగళగిరి టౌన్, మేజర్‌న్యూస్

నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిం చిన నారా చంద్రబాబు నాయుడు చరిత్రలో ఏ ముఖ్య మంత్రి చేయని విధంగా మొదటి రోజునే ఐదు చరిత్రాత్మక ఫైళ్లపై సంతకాలు చేశారని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అన్నారు. శనివారం టీడీపీ కార్యాలయం ఎమ్మెస్సెస్ భవన్ లో పట్టణ అధ్యక్షులు దామర్ల రాజు, మండల అధ్యక్షులు తోట పార్థసారథి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదు అంశాలకు సంబంధించి లబ్ధి పొందబో యే లబ్ధిదారులతో కలిసి మీడియా సమావే శం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజ కవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, జనసేన ఎంటీఎంసీ అధ్యక్షులు మునగపాటి వెంకట మారుతీరావు, బీజేపీ రాష్ట్ర చేనేత కన్వీనర్ జగ్గారాపు శ్రీనివాసరావులు మాట్లాడుతూ చరిత్రలో కనీ వినీ ఎరుగని రీతిలో మెజారిటీ సీట్లు ఇచ్చిన రాష్ట్ర ప్రజలకు మేలు చేయాలని మొదటి రోజు నుంచే తపనపడే గొప్ప సీఎం చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఐదు కీలక హామీల అమలుపై నిర్ణయం తీసుకున్నా రన్నారు. తొలి ఐదు సంతకాలతో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు, రైతులకు, వృద్దులు, వితంతు వులు, వికలాంగులకు, నిరుపేదలకు భద్రత, భరోసా కల్పించారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీ మేరకు దాదాపు 16,347 టీచర్ల పోస్టుల భర్తీకై డీఎస్సీని నిర్వహించే ఫైల్ పై రాష్ట్ర ముఖ్యమంత్రి తొలి సంతకం చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు శ్రీకారం చుట్టారన్నారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఒకేసారి ఇంత భారీ సంఖ్యలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టడం ఇదే తొలిసారి అన్నారు. డీఎస్సీ నిర్వహిస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపో యిందన్నారు. ప్రజల ఆస్తులకు అభద్రతను కల్పించే విధంగా గత ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేస్తూ ముఖ్యమంత్రి రెండో సంతకాన్ని చేశారన్నారు. దీని వల్ల రాష్ట్రంలోని రైతులు, ప్రజలకు వారి ఆస్తులపై పూర్తి భద్రత, భరోసా కల్పించడం జరిగిందన్నారు. సామాజిక భద్రత పథకం క్రింద వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు ప్రతి నెల ఇచ్చే ఫించనును కూడా రూ.3 వేల నుండి 4 వేలకు పెంచే ఫైల్ పై ముఖ్యమంత్రి మూడో సంతకం చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుండే ఈ పెంపును వర్తింప చేస్తూ ఏప్రిల్, మే , జూన్ మాసాలకు చెందిన రూ.3 వేలను కలుపుకుని జూలై మాసంలో మొత్తం రూ.7 వేలను వృద్దాప్యపు ఫించనుగా అందజేయ నున్నట్లు వారు తెలిపారు. వికలాంగులకు అయితే ప్రస్తుతం ఇచ్చే రూ.3 వేలను రూ.6 వేలకు పెంచడం జరింగిందన్నారు. నిరుపేదలకు పట్టెడన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను పునరుద్దరిస్తూ ముఖ్యమంత్రి నాలుగో సంతకం చేయడం జరిగిందన్నారు. అదే విధంగా నిరుద్యోగ యువత అభిరుచికి అనుగుణంగా వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి వారి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పర్చాలనే లక్ష్యంతో స్కిల్ సెన్సస్ పథకాన్ని అమలుపర్చే ఫైల్ పై ముఖ్యమంత్రి ఐదో సంతకం చేసి నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భద్రత, భరోసా కల్పించారని ప్రశంసించారు. రాష్ట్ర ప్రజలు తమ పార్టీపై మంచి భరోసాతో పెద్ద ఎత్తున ఓట్లు వేసి మంచి మెజారిటీతో గెలిపించారన్నారు. ప్రజల తమ ప్రభుత్వంపై ఉంచిన విశ్వాసాన్ని ఏమాత్రము ఒమ్ము చేయకుండా మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, మంగళగిరి పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకటరావు, రాష్ట్ర తెలుగుమహిళ కార్యదర్శి వింజమూరి ఆశాబాల, ఊట్ల శ్రీమన్నారాయణ, మంగళగిరి నియోజకవర్గ టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు కూరపాటి మురళి రాజు అన్నం నాగబాబు, మున్నంగి శివ శేషగిరిరావు, పార్లమెంట్ సాధికార సమితి సభ్యులు బట్టు చిదానంద శాస్త్రి, వాకా మంగారావు, నందం బాబురావు, , మంగళగిరి పట్టణ బిజెపి అధ్యక్షుడు కాండ్రు భాను కిషోర్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభాని, పట్టణ మహిళా అధ్యక్షురాలు ఊట్ల దుర్గా మల్లేశ్వరి, మాజీ కౌన్సిలర్ జంజనం శ్రీనివాసరావు, జనసేన మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సుభాని, షేక్ సుభాని (గల్ఫ్) ఉద్దంటే పద్మావతి, షేక్ నజీర్, షేక్ హుస్సేన్ (కొత్తపేట) ఉద్దంటే గాంధీ, విన్నకోట శ్రీనివాసరావు, తిరుమలశెట్టి మురళీకృష్ణ, బిజెపి నాయకులు కోవిలాకర్ రాకేష్ జి, కొక్కిరాల యశోద కృష్ణ, మొండి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ



వినుకొండ, మేజర్‌న్యూస్: గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తక్షణమే చంద్రబాబు నాయుడు రద్దు చేసిన సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె ఎస్ ఎన్ వి నాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈసభకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు,జనసేన నాయకులు కొంజేటి నాగ శీను రాయల్,నిస్శంకర శ్రీనివసరావు,తెలుగుదేశం పట్టణ అధ్యక్షు లు అయూబ్ ఖాన్ పాల్గొన్నారు. గత పాలకులు నిరంకుషత్వంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను అమలులోనికి తీసుకువచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి నష్టము చేయు ధోరణిలో వ్యవహరించియుండగా ఇది గ్రహించిన టు వంటి న్యాయవాదులు దూరదృష్టితో భవిష్యత్తులో ప్రజలకు జరగబోయే నష్టమును నివారించుటకుగాను న్యాయవాదులు ఉద్యమం చేయగా, ఈఉద్యమానికి ఉమ్మడి కూటమి అభ్యర్థులు వెన్నుదన్నుగా నిలిచి మద్దతు తెలిపినారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం రద్దు చేయడం చాలా శుభ పరిణామం అని తెలియచేశారు. అందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఫోటోను,పవన్ కళ్యాణ్ ఫోటోలను పాలాభిషేకం చేయడం జరిగినది. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టం రద్దు కావడం శుభ పరిణామం అని,ఈ చట్టం రద్దు చేయటంలో కీలక పాత్ర పోషించిన ప్రతి న్యాయవాదికి సన్మానించడం మన బాధ్యతని జనసేన నాయకులు కొంజేటి నాగ శ్రీను రాయల్ న్యాయవాదులందరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గాలి నాగరాజు,సెక్రటరీ పఠాన్ గౌస్ మొహిద్దిన్ ఖాన్,జాయింట్ సెక్రటరీ ఎలవర్తి శ్రీనివాస్ రావు,ట్రెజరర్ చీమకుర్తి బ్రహ్మం,సీనియర్ న్యాయవాదులు ఎన్ రామకోటేశ్వరరావు,తలగంశెట్టి హనుమంతరావు,ఎలవర్తి శ్రీనివాసరావు,ముప్పాళ్ళ జ్ఞానేశ్వర్ రావు,ఎస్ కె సిద్దయ్య,జెట్టి తిరుపతిరావు, భీమవరపు శ్రీనివాసరావు, యనమదల శ్రీనివాసరావు,తదితరులు పాల్గొన్నారు.

# ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు హర్షణీయం

**◀ ప్రజల భూములను కాజేసేందుకే పన్నాగం**

**◀ మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్**



తెనాలి, మేజర్‌న్యూస్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై చంద్రబాబు నాయుడు సంతకం చేయడం పట్ల రాష్ట్ర ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. ప్రజల ఆస్తులకు ప్రమాదం కలిగించే అప్రజాస్వామిక చట్టాలను రద్దు చేస్తూ ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. రాష్ట్ర ప్రజల భూములను కాజేసేందుకు పన్నిన గత ప్రభుత్వ పాలకుల కుట్రని చంద్రబాబు నాయుడు భగ్నం చేశారని వైసిపి పార్టీపై ధ్వజమెత్తారు. మెగా డిఎస్సి పై చేసిన తొలి సంతకం ద్వారా చదువుకున్న నిరుద్యోగ యువతలో నూతన ఉత్తేజాన్ని నింపాన్నారు. ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న నిరుద్యోగుల సమస్యను కొలిక్కి తీసుకొచ్చారని వ్యాఖ్యానించారు. ఎన్నికల హామీల్లో చెప్పినట్లు ఒక్క సంతకంతో నెలకు రూ 4 వేల పెన్షన్ కల సాకారమైందని అన్నారు. అన్నా క్యాంటీన్ ను పున ప్రారంభించి అన్నార్తుల ఆకలి దప్పికలకు తెర దించారన్నారు. సాంకేతిక విద్యానభ్యసించిన విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికితీసే స్కిల్ డెవలప్మెంట్ దస్త్రంపై సంతకం చేసి రాష్ట్ర పురోగాభివృద్ధికి బాటలు వేశారన్నారు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన తీరులో 2024 ఎన్నికలు జరిగాయని ఆలపాటి పేర్కొన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడంతో 1631 రోజులపాటు రైతులు చేసిన దీక్షలు నుంచి అమరావతి ప్రజలు విముక్తులయ్యారని అన్నారు. గత ప్రభుత్వంలో వైనాట్ 175 అన్న నేతలకు చెంపపెట్టుగా 164 నియోజకవర్గాల్లో విజయం సాధించిపెట్టిన ప్రజా ఓటర్లకు తాను ఋణపడి ఉంటానన్నారు. జైలు శిక్ష అనుభవిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి ప్రభుత్వ పోకడలను ఎండగట్టిన చంద్రబాబు నాయుడు పోరాటం మరువలేనిదన్నారు. రాష్ట్రమంతా సంతోష, సంభ్రమాశ్చర్యాలతో సందడి చేస్తున్న ప్రజలు ఆనందాన్ని చూస్తుంటే మనస్సు పులకరిస్తుందన్నారు. అగ్నికి వాయువు తోడైనట్లు తెలుగుదేశం పార్టీకి జనసేన అధినేత పవన్ కళ్యాణ్, దేశ ప్రధాని మోదీ తొడవ్వడం మరింత బలాన్ని సమకూర్చిందని అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షనేతగా చంద్రబాబు నాయుడు చేసిన శపథాన్ని ప్రజా ఓటర్ల ద్వారా నెరవేర్చుకున్నారని అన్నారు. కేంద్ర సహాయ మంత్రి గా బాధ్యతలు చేపట్టిన పెమ్మసాని చంద్రశేఖర్, ఆహార పౌర సరఫరాలు, వినియోగదారుల మంత్రి పదవి దక్కిన నాదెండ్ల మనోహర్ ను ప్రత్యేకంగా అభినందించారు. కూటమిని గెలిపించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు కార్యక్రమంలో కత్తెర సురేష్, తడిబోయిన హరిప్రసాద్, మొహమ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్ తదితరులు పాల్గున్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎన్డీయే కూటమి ప్రభుత్వం

పొన్నూరు, మేజర్‌న్యూస్

రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి 5 సంతకాలు పేద బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పెట్టి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పొన్నూరు శాసనభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ నాయకత్వంలో సంక్షేమం అభివృద్ధి సాగుతుందని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు, యువత, వృద్ధులు, పేదలు, రైతులకు న్యాయం చేసేలా ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని.. గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుగారి తొలి 5 సంతకాలే ఇందుకు నిదర్శనమని పొన్నూరు నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు అభిప్రాయపడ్డారు. గత 5 ఏళ్లలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అరాచక పాలన సాగించి రాష్ట్రాన్ని సర్వనాశనం



చేశాడని.., జగన్ దోపిడీలు, దౌర్జన్యాలకు విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు వైసీపీని తరిమికొట్టి టీడీపీ–జనసేన–బీజేపీ కూటమికి ఏకంగా 164 సీట్లు ఇచ్చి ఆశీర్వదించారని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యావ్యవస్థను గాడిలోపెట్టేందుకు, విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అలాగే ప్రజలకు తమ ఆస్తులపై హక్కుల్లేకుండా చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్ద చేస్తూ రెండో సంతకం చేశారని తెలిపారు. అలాగే ఎన్టీఆర్ రూ.30తో మొదలుపెట్టిన సామాజిక పెన్షన్లను ప్రస్తుత పరిస్థితులు అవసరాలకు తగ్గట్లు ఎన్నికల్లో చెప్పిన విధంగా నారా చంద్రబాబు నాయుడుగారు రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారని దీని ద్వారా లబ్ధిదారుల పోషణకు, వైద్య ఖర్చులకు ఎలాంటి లోటు ఉండదన్నారు. ఎన్నికల్లో చెప్పిన విధంగా ఆ హామీని నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. అలాగే ఎందరో అభాగ్యులకు, అనాథల ఆకలి తీర్చేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేయగా.. అధికారంలోకి వచ్చిన వెంటనే పేదల ఆఖలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ చంద్రబాబు నాయుడుగారు నాలుగో సంతకం చేశారని నాయకులు తెలిపారు. దీంతో పాటు చదువుకొని ఉపాధి, ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతకు ఊతమిచ్చేందుకు నైపుణ్యగణన చేపడుతూ 5వ సంతకం చేశారు. తద్వారా యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నారని అభిప్రాయపడ్డారు. చంద్రబాబు నాయుడు చేసిన 5 సంతకాలతో పాటు కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోలోని ప్రతి హామీని అర్హులైన వారికి చేర్చేందుకు పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో తామంతా పనిచేస్తాని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక, అమలు తదితర అంశాల్లో ఎలాంటి వివక్షకు తావులేకుండా అర్హులైన వారందరికీ న్యాయం జరిగేలా చూస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం–జనసేన–బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# రక్తదాతల దినోత్సవం సందర్భంగా శిబిరం ఏర్పాటు

నరసరావుపేట, మేజర్‌న్యూస్

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ శ్రీకేష్ లత్కర్ బాలాజీరావు ఐ.ఏ.ఎస్ ఆదేశాల మేరకు రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట ఫార్మసీ కాలేజీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ జె. ఎన్. సురేష్ కుమార్ , విశిష్ట అతిథులుగా రెడ్ క్రాస్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు శ్రీ కె.ఎం.ఎన్. వి. శ్రీనివాస గుప్తా గారు, బత్తుల మురళి , డాక్టర్ రేహమతుల్లా గారు, బి. వి. ఎల్ ప్రసాద్ గారు హాజరైనారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి నరసరావుపేట ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ గారు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత, మానవతా దృక్పథంతో రక్తదానం చేయాలని, ఈరోజు ముఖ్యంగా ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్న వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు దానిలో భాగంగానే నరసరావుపేట ఫార్మసి కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం చాలా సంతోషమని తెలియజేశారు. విశిష్టతలు శ్రీ.కే.ఎం.యన్.వి శ్రీనివాస గుప్తా



మాట్లాడుతూ రెడ్ క్రాస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలుజిల్లాలో అందిస్తున్నామని 1901 లో కార్ల్ లాండ్ స్టీనర్ అనే శాస్త్రవేత్త రక్తం యొక్క వర్గాలను పరిశోధన చేసి నిర్ధారించారు అతని యొక్క జన్మదినాన్ని ప్రపంచ రక్తదాతల దినోత్సవం గా జరుపుకుంటున్నారని తెలియజేశారు. ప్రపంచంలో మనం శాస్త్రీయపరంగా, సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి చెందినప్పటికీ రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయలేకపోయాము కాబట్టి మనిషికి అవసరమైన రక్తం కేవలం మానవ శరీరంలోనే తయారవుతుందని కర్మాగారాలలో తయారు చేయలేమని కాబట్టి ప్రతి ఒక్కరు రక్తదానం చేయడం వలన వేరొక ప్రాణాలను కాపాడగలమని తెలియజేశారు. డాక్టర్ రహమతుల్లా మాట్లాడుతూ ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం కొరకు వచ్చిన విద్యార్థినీ విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యతను మరియు సామాజిక సేవా కార్యక్రమాలను అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. బి . వి ఎల్ ప్రసాద్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలు కాపాడవచ్చు అని ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చునని కాబట్టి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని తెలియజేశారు. బత్తుల మురళి గారు మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన కాలేజ్ యజమాన్యానికి విద్యార్థిని విద్యార్థులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ రోజు ఫార్మసీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరంలో మొత్తం 38 మంది విద్యార్థిని విద్యార్థులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కె యం యన్ వి శ్రీనివాస గుప్తా , డాక్టర్ రెహమతుల్లా , బత్తుల మురళి , బి వి ఎల్ ప్రసాద్ ., నరసరావుపేట ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్ కుమార్ , ప్రొఫెసర్ డాక్టర్. వెంకట గోపయ్య , ఎన్.ఎస్.ఎస్ .ఆఫీసర్ పి లాజర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి , అసోసియేట్ ప్రొఫెసర్ ఎం రామకృష్ణ , యన్ కోదండరామ , సీత , రెడ్ క్రాస్ సిబ్బంది ,రెడ్ క్రాస్ లైఫ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి ప్రాణాలు నిలబెట్టండి



వినుకొండ, మేజర్‌న్యూస్

ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం వలన ఎంతో మంది ప్రాణాలు నిలబడతాయని రాష్ట్ర అవార్డు గ్రహీత బెస్ట్ సోషల్ ఆక్టివిస్ట్ పీవీ సురేష్ అన్నారు.ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా గుంటూరు మెడికల్ కాలేజ్ లో జరిగిన రక్తదాన శిబిరంలో ఆయన 83వసారి రక్తదానం చేశారు.సురేష్ బాబును రక్తదాన శిబిరం నిర్వహించిన మెడికల్ కాలేజ్ కమిటీ వారు సన్మానించి,రక్తదానం చేస్తున్నటువంటి అందరికీ సురేష్ బాబు స్ఫూర్తిదాయకమన్నారు.ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతలు అవుతున్నటువంటి మీ అందరిని అభినందిస్తున్నానన్నారు.ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నటువంటి రక్త దాతలు ఇంకా ముందుకు రావాలని అన్నారు.రక్తం ఇవ్వడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటామని మానసికంగా శారీరకంగా దృఢంగా ఉంటాము అని తెలియజేశారు.

## నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



రెంటచింతల, మేజర్‌న్యూస్

మండల కేంద్రమైన రెంటచింతల లో మచికల్లు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నూరు శాతం బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్చ డమే లక్ష్యంగా విద్యాశాఖ జూన్ 13 నుంచి పై నుండి జులై 12వరకు నేను బడికిపోతా కార్యక్రమం శుక్రవారం మండలంలోని రెంటచింతల మంచికల్లు పాఠశాలలో నిర్వహించారు. రెంటచింతలలో ఆరోగ్యపురం, సుబ్బన్న తోట, అంజనేయస్వామిమాన్యం కాలనీలు, మంచికల్లులో అన్ని వీదులలో ఉపాధ్యాయులు, చిన్నమ్మ, పుల్లారావు నాయక్, సోమా ర్లాబాయక్, వసంతకుమారి, సిలార్, వెంకటేశ్వర్లు, బాస్కర్, రమణారెడ్డి జాని తదితరులు తిరిగారు ప్రతి వీధిలోనూ తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలలో చేరితే అంటి అన్ని సౌకర్యాలపై అవగాహన కల్పించారు.

## ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు పై న్యాయవాదుల హర్షం

సత్తెనపల్లి,మేజర్‌న్యూస్

గత ప్రభుత్వ హయంలో తీసుకొన్న తుగ్లక్ నిర్ణయం అయిన ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని రద్దు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సత్తెనపల్లి తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు మద్దినేని వెంకట చలపతిరావు ఆధ్వర్య లో న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలోని తాలూక కార్యాలయ ప్రాంగణంలో ఉన్న న్యాయస్థానల సముదాయంలో ప్రాంగణంలో న్యాయవాదులు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంబాల అనిల్ కుమార్,పలువురు సీనియర్ న్యాయ వాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ . జగన్మోహనరెడ్డి ప్రజల ఆస్తులను తన గుప్పిట్లో పెట్టుకొనే విధంగా, ప్రజలకు ఇబ్బంది కరమైన ల్యాండ్ టైటలింగ్ చట్టం తీసుకురావడంపై నారా చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉన్నపుడు దాన్ని వ్యతిరేకించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని అని ఇచ్చిన హామీ ఇచ్చారు. చెప్పిన విధంగానే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేశారు. ఇది అభినందించదగ్గ విషయం. యావత్తు ఆంధ్రప్రదేశ్ ప్రజలు సంబరాలు చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న కాక్షిదారులకు, న్యాయవాదులకు మరియు న్యాయవాద



గుమాస్తాలకు స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అనుమోలు జయరాం,పూజల వెంకట కోటయ్య, కళ్ళం వీర భాస్కరరెడ్డి,దివ్వెల శ్రీనివాసరావు,పూదోట రాజు, గంగూరి అజయ్ కుమార్,షేక్ జానీ ఖాజావలి, కొల్లా వెంకటేశ్వరరావు,బి.ఎల్.లక్ష్మీ కోటేశ్వరరావు,బొక్క సంగీతరావు, చలువాది చిన సత్యనారాయణ, ఉల్లం మధు, గంటా వెంకట శివ, తవ్వా హరనాథ్,గంపా మదనమోహన్ ,పాటిబండ్ల రవి, యేసురత్నం , బొమ్మిశెట్టి శ్రీనివాసరావు మరియు పలువురు న్యాయవాద గుమాస్తాలు పాల్గొన్నారు.

## అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ పిలుస్తుంది కార్యక్రమం





వినుకొండ, మేజర్‌న్యూస్

నియోజకవర్గ పరిధిలోని అన్ని అంగన్వాడి కేంద్రాల్లో అంగన్వాడి పిలుస్తుంది అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ కే ఉషారాణి ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేం ద్రాల లబ్ధిదారులతో ఆమె సమావేశం అయ్యారు.ఈసమావేశంలో ఆమె మాట్లా డుతూ అంగనవాడీ కేంద్రాల ద్వారా లబ్ధి పొందే గర్భిణీలకు, బాలింతల కు,మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రాలలో చేర్చుకునేందుకు తల్లుల కు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.పూర్వ ప్రాథమిక విద్యకు అవసరమైన పుస్తకాలు ఆట వస్తువులు సరఫరా చేస్తున్నట్లు పిడి వివరించారు.గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు నిర్వహించారు.ఐదు నిండిన పిల్లలందరికీ కూడా అంగన్వాడి సెంటర్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి సిడిపిఓ అనురాధ,సూపర్వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాదిగలకు పెద్దపీట వేసిన చంద్రబాబు నాయుడు

రెంటచింతల, మేజర్‌న్యూస్

మండల కేంద్రమైన రెంటచింతల లోని స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీ ఎస్ నాయకులు గడిపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాయకరా వుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితను హోం మంత్రి పదవి ఇచ్చిన మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు, ఈ సందర్భంగా మ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి ఈ మంత్రివర్గంలో పదవి దక్కించుకున్న ఏకైక ఎమ్మెల్యే వంగలపూడి అనిత. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎంతో మంది సీనియర్



నేతలు ఉన్నప్పటికీ.. పార్టీ పట్ల ఆమె చూపిన విధేయతకు మంత్రి పదవిని కేటాయించిన చంద్రబాబు.. ఈసారి ఏకంగా హోంమంత్రిని చేశారు. అధినేత నమ్మకాన్ని నిలబెడుతూ రికార్డు విక్టరీ కొట్టారు వంగలపూడి అనిత. స్థానిక టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులను కలుపుకుని వెళ్లి 2024 ఎన్నికల్లో పాయకరావుపేట అసెంబ్లీ స్థానం నుంచి 43,727 ఓట్ల తేడాతో గెలిచి చరిత్ర సృష్టించారు.తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేస్తూ వైసీపీ విధానాలను ఎండగడుతూ ప్రజల మనసును గెలుచుకుందన్నారు, ఇంకా ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కోరారు.

# అయిదు సంతకాలతో ప్రజల లోగిళ్లలో కొత్త సంతోషాలు

## ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



వినుకొండ మేజర్ న్యూస్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే చంద్రబాబు చేసిన అయిదు సంతకాలతో రాష్ట్రంలోని ప్రతి లోగిల్లో కొత్త సంతోషాలు విరబూశాయని శుక్రవారం ఒక ప్రకటన ద్వారాఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎన్నికలకు ముందు,తర్వాత కూడా వైకాపా చేస్తోన్న దుష్ప్రచారాలకూ ఈ సంతకాలతో చెంపపెట్టు లాంటి సమాధానం చెప్పినట్లైందన్నారు. ఆర్థికంగా, పరిపాలనపరంగా ఎన్నో సవాళ్లున్నా ఇచ్చిన మాట ప్రకారం మొదటిరోజు అలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడం చంద్రబాబుకు మాత్రమే సాధ్యమన్నారు. అయిదేళ్ల క్రితం జగన్ అనే ఒక సైకోకు అధికారం ఇస్తే ప్రజా వేదిక కూల్చివేతతో తన పాలన ప్రారంభించి, రాష్ట్రాన్ని విధ్వంసం చేశాడని, ఇప్పుడు చంద్రబాబు సంక్షేమ సంతకంతో నవశకానికి నాంది పలికారన్నారు. ఒక అరాచకవాదికి,దార్శనికుడికి మధ్య తేడా అదే అని జీవి అన్నారు.ఇకపై రాష్ట్రవ్యాప్తంగా తెరుచుకోనున్న అన్నక్యాంటీన్ల ద్వారా పూటకు 5 రూపాయలతోనే నిరుపేదల ఆకలితీరుతుందన్నారు. ఈ సంక్షేమం, ఉపాధికి ఊతమిచ్చిన సంతకాల అనంతరం ప్రభుత్వం దృష్టి పెట్టాల్సింది గడిచిన అయిదేళ్ల అవినీతి,అక్రమాలపై అన్నారు. తెలుగుదేశం పార్టీ విపక్షంలో ఉన్నప్పుడు విడుదల చేసిన ఛార్జ్‌షీట్ ప్రకారమే ముఖ్యమంత్రి జగన్ అండ్ గ్యాంగ్ అయిదేళ్ల వైకాపా పాలనలో 8 లక్షల కోట్ల ప్రజాధనం లూటీ చేశారని,అందులో ప్రతి పైసా ఇప్పుడు కక్కించాల్సిన అవసరం ఉందన్నారు.

# కంభంపాడు పోస్టాఫీసులో రూ.10లక్షలు గోల్‌మాల్..?

**లబోదిబోమంటున్న బాధితులు - మాచర్ల పోస్ట్ ఆఫీస్ వద్దకు చేరుకున్న బాధితులు**



మాచర్ల మేజర్ న్యూస్ః మాచర్ల మండలం కంభంపాడు గ్రామంలో పోస్ట్ ఆఫీస్‌లో సుమారు రూ.10లక్షలు గోల్ మాల్ అయినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం కంభంపాడు గ్రామానికి చెందిన సుమారు 40 మంది బాధితులు మాచర్ల పోస్ట్ ఆఫీస్ వద్దకు చేరుకున్నారు. కార్యాలయంలో పోస్టల్ ఇన్స్పెక్టర్ లేకపోవడంతో బాధితులు రెండు గంటలపాటు వేచి ఉన్నారు. బాధితురాలు మాట్లాడుతూ కంభంపాడు గ్రామంలో పోస్ట్ ఆఫీస్ నందు ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన సుకన్య పథకంలో కె ఆదిత్య పేరున 4676790050 ఎకౌంట్ను ప్రారంభించా మన్నారు. సుమారు మూడు సంవత్సరాల నుండి డబ్బులు నెలనెల జమ చేస్తున్నట్లు వివరించారు. 2023 సంవత్సరం 11వ నెల డబ్బులు చెల్లించాము. పోస్టుమాస్టర్ కార్తీక్ బుక్‌లో రాసి స్టాంపు కూడా వేశారు.డిసెంబర్ నెలలో డబ్బులు కట్టేందుకు పోస్టా ఫీస్‌కి వెళ్ళగా నవంబర్లో డబ్బులు చెల్లించలేదని ఇంచార్జ పోస్టు మాస్టర్ తెలిపారు. కార్తీక్ పోస్టు మాస్టర్ ఎక్కడికి వెళ్లాడని అడిగితే అధికారులు సస్పెండ్ చేశారని తెలిపారన్నారు. సుకన్య పథకం అకౌంట్ బుక్‌ను సత్తెనపల్లి హెడ్ పోస్టాఫీస్‌కు పంపి జమ చేసేందుకు హెచ్‌ఓకు పంపారన్నారు.నా బుక్‌లో డబ్బులు జమ చేయకుండా నాకు డూప్లికెట్ పాస్‌బుక్‌లో అక్టోబర్ నెల 2023 వరకు మాత్రమే ఎంటర్ చేసి బుక్ ఇచ్చారన్నారు. ఇదేమిటి అని పోస్టుమాస్టర్‌ను ప్రశ్నించగా ముందు నవంబర్ నెల డబ్బులు కట్టండి. తరువాత విచారించి అధికారులు పుస్తకంలో జమ చేస్తారని చెప్పి నేటికీ ఏడు నెలలు అయినా జమ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ఖాతాదారుల సేవింగ్ అకౌంట్, ఆర్‌డిలో నగదును డ్రా చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ వద్ద ఆందోళన చేసిన వారిలో సిహెచ్ హరి, నవ్యశ్రీ, రంగారెడ్డి, లక్ష్మమ్మ, శ్రీలక్ష్మి, గడ్డం ఈశ్వరమ్మ, మంగమ్మ, నాగేంద్రం, లాజర్, అబ్రాహాం, చంద్రశేఖర్ రెడ్డి, వినిగండ్ల పెద్ద నరసింహారావు పాల్గొన్నారు.

# బక్రీద్ రోజు గోవధ నిషేధం: జిల్లా కలెక్టర్ ఆదేశం



గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

జిల్లాలో బక్రీదు పర్వదినం గౌరవ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా అహ్లాదకర వాతావరణంలో సజావుగా నిర్వహించుకునేలా సంబంధిత శాఖల నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి , జిల్లా ఎస్పీ తుషార్ దూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాద్ తో కలసి బక్రీదు పర్వదినం నేపథ్యంలో నోడల్ అధికారులు, జంతుహింస నివారణ సంఘం ప్రతినిధులు, మతపెద్దలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జూన్ 17 బక్రీద్ పర్వదిన రోజు హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు జంతువధలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో పోలీసు, మున్సిపల్, పంచాయితీ, రెవెన్యూ, పశుసంవర్ధక శాఖ, రవాణా శాఖల అధికారులతో నోడల్ అధికారులను నియమించటం జరిగిందన్నారు. అనధికారికంగా జంతువధలు, జంతువధ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా నోడల్ అధికారులు నియమించిన ప్రత్యేక టీంలు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. జంతువులు అక్రమ రవాణా జరగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు ప్రత్యేకంగా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ గోవధ నిరోధక చట్టం 1977 ప్రకారం గోవులను వధించరాదన్నారు, అదేవిధంగా చూలు గేదేలు, మూడు నెలలు దూడలు కలిగిన పశువులను వధించరాదన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు నిర్ధారణ చేసిన పశువులను మాత్రమే నిర్దేశించిన జంతువధశాలలో వధించాలన్నారు. అధికారులతో పాటు, మత పెద్దలు, జంతు హింస నివారణ సంఘం ప్రతినిధులు జంతు వధ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. జంతు వధలకు తాత్కలికంగా ఏర్పాటు చేసిన జంతు వధ శాలలపై మున్సిపల్ అధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పాల్గోన్న జంతు హింస నివారణ సంఘం ప్రతినిధులు తెలిపిన అంశాలపైన నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ తుషార్ దూదీ మాట్లాడుతూ జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలు జరగకుండా ప్రత్యేకంగా పికెట్లు, చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షించటం జరుగుతుందన్నారు. గతంలో చట్టాల ఉల్లంఘనలకు పాల్పడిన వ్యక్తులను బైండోవర్ చేయటం జరిగిందని, పోలీస్ స్టేషన్ పరిధిలోను, సబ్ డివిజన్ పరిధిలోను ప్రత్యేకంగా పోలీస్ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసి జంతు హింస నివారణ చట్టాలపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. జంతు హింస నివారణ సంఘాల ప్రతినిధులు చట్టాల ఉల్లంఘనలపై సమాచారం ఉంటే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి లేదా సబ్ డివిజన్ అధికారికి అవసరమైతే తనకైన ఫోన్ చేసి సమాచారం అందించవచ్చన్నారు. అధికారులు, పోలీసులు, జంతు హింస నివారణ సంఘాల ప్రతినిధులతో ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేయటం జరుగుతుందని, చట్టాల ఉల్లంఘనలపై సమాచారం ఉంటే గ్రూప్‌లో పోస్ట్ చేయాలన్నారు. జంతు హింస నివారణ చట్టాలు ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు. బక్రీదు పర్వదినం శాంతి సామరస్యములకు విఘాతం కలిగించకుండా ఆహ్లాదకర వాతవరణంలో జరుపుకునేందుకు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. సమావేశంలో గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీకర్, పశుసంవర్ధక శాఖ జెడీ జెపీ వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ సీఈఓ వసంత రాయుడు, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ జమీర్ బాషా, ఆర్టీఓ ఎన్ గోపాల్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ నయిమ్ అహ్మద్, ఎంటీఎంసీ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీ పతి రావు, జీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా. ఆషా, జిల్లా పంచాయితీ అధికారి కె శ్రీదేవి, జంతుహింస నివారణ సంఘం ప్రతినిధులు దాసరి రాము, బీవి శివరాం పాల్గొన్నారు.

# మాతృ మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలి

## వైద్యారోగ్యశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆదేశం

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

మాతృమరణాలు సంబంవించకుండా గర్భవతుల అరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్‌రెడ్డి వైద్యారోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) పవార్ స్వప్నిల్ జగన్నాద్ తో కలసి జిల్లాస్థాయి మాతృ మరణాల సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో డిసెంబర్ నుండి మార్చి వరకు సంభవించిన ఆరు మాతృ మరణాలకు గల కారణాలపై వైద్యులతో జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి సమీక్షించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ హైరిస్క్ కేసుల్ని ముందుగానే గుర్తించి పైస్థాయి ఆసుపత్రులకు చెకప్ కు మరియు కాన్పుకు పంపించేందుకు ఆరోగ్య కార్యకర్తలు, డాక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. సిజేరియన్ డెలివరీ అయిన స్త్రీని కనీసం ఐదు రోజులు తప్పనిసరిగా ఆసుపత్రిలోనే ఉంచాలని, అన్ని హైరిస్కు గర్భిణీ స్త్రీలకు ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు 8 నుండి 9 నెలల మధ్యలో చేయాలని, గర్భిణీ స్త్రీలకు క్రమం తప్పకుండా బిపి, షుగర్, హెచ్ బి, థైరాయిడ్ పరీక్షలు చేయాలన్నారు. అధిక బరువు ఉన్న స్త్రీలు గర్భం దాల్చుటకు ముందు బరువు తగ్గించుకునేలా అవసరమై చర్యలు తీసుకోవాలన్నారు. గర్భస్రావం మందులు గర్భకోశ నిపుణుల అనుమతి లేకుండా, మందుల దుకాణములలో విక్రయించరాదన్న ఆదేశాలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డ్రగ్ ఇన్స్పెక్టర్లకు అందజేయాలన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మందుల షాపులు మరియు సిజేరియన్ కాన్పులు అధికముగా జరుగు ఆసుపత్రులను పర్యవేక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గర్భవతులకు సుఖప్రసవాలు జరిగి మాతృ మరణాలు పూర్తి స్థాయిలో నివారించేలా ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్. కె. విజయలక్ష్మి ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్. ఏ శ్రావణ్ బాబు, డాక్టర్ సిహెచ్ రత్నమన్మోహన్, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు, డి. సి. హెచ్. ఎస్, లతో పాటు ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

